నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శనివారం | సెప్టెంబర్ 30, 2023 | www.navatelangana.com

ప్రారంభానికి ముందే శిలాఫలకం ధ్వంసం

నవతెలంగాణ - సిర్పూర్(టి)



మండలంలోని హీరాపూర్ గ్రామం నుండి శివపూర్ గ్రామాల మధ్య చేపట్టబోయే రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర అటవీ న్యాయ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేయడానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రోడ్డు పక్కన పడేశారు. దీనిపై పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

రెండో రోజుకు చేరిన ఎండీఎం కార్మికుల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు సమ్మె చేపడుతున్న విషయం తెల్సిందే. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి మాట్లాడుతూ కార్మికులకు తక్షణమే పెరిగిన వేతనాల చెల్లింపుకు బడ్జెట్ విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కొత్త మెనూకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరిజాబాయి, జమున, శ్యామలి, శివాని హోల్దార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-ఉట్నూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తుడుందెబ్బ జిల్లా నాయకులు అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యల సాధన కోసం ఐటీడీఏ ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మెకు తుడుందెబ్బ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా మహిళ నాయకురాలు పెందూర్ పుష్పరాణి, జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు పాల్గొని మాట్లాడారు. గత 19 రోజులుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమని అన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం మహిళలపై వివక్షత చూపినట్టేనన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ ఉద్యోగుల విధులతో ఆ గ్రామంలోని ప్రతి ఒక్కరితో అవినాభావ సంబంధం ఉందన్నారు. వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, పలు న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా నాయకులు వెట్టి మనోజ్, శ్యామ్‌రావ్, రాందాస్, భరత్, హన్మంతరావు, గణపతి, అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు రత్నమాల, పద్మా, స్వర్ణలత, కవిత, లక్ష్మి, సుశీల, లలిత, కవిత, లక్ష్మి ఉన్నారు.

సీఎం కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు

- కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-నిర్మల్

అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను నమ్మి మోసపోద్దని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సారంగాపూర్ మండలంలోని వైకుంఠాపుర్, ధని, బోరిగాం, సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ గూటికి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్నాయని మోసపూరిత హామీలతో సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అసమర్థత మంత్రి ఇప్పటివరకు సారంగాపూర్ మండలంలో ఒక డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదని ఎద్దేవ చేశారు. ఇంటింటికి దళితబంధు పథకాన్ని అందిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేండ్లు గడుస్తున్న ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కలలు సాకారం చేసిన సోనియా గాంధీ ఆరు హామీల ఉచిత పథకాలకు ప్రకటించారని, అధికారంలోకి రాగానే వంద రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తే పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ నర్సయ్య, రొడ్డ మారుతి, రామ్‌రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, నక్క మధుకర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి రైతు మృతి

నవతెలంగాణ-బోథ్

విద్యుత్ వైరు తెగిపడి రైతు మృతి చెందిన సంఘన మండలంలోని పొచ్చెర గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడి తండ్రి రాజారెడ్డి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రైతు కొమ్ము రాములు(30) చేనులో పంటకు పురుగులమందు పిచికారి చేస్తుండగా, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం రావడంతో చేనులో ఉన్న కరెంటు స్తంభం విద్యుత్ వైరు మంటలు చెలరేగి తెగి రైతుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.

సాత్నాల గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-జైనథ్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సాత్నాల ప్రాజెక్టుకు భారీ వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. నిల్వ నీటి మట్టం కంటే ఎక్కువగా పెరుగడంతో రెండు గేట్లు ఎత్తి బయటకు నీరు వదులుతున్నట్టు ఏ.ఈ మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటువైపుగా పశువులని ఎవరు కూడా వదిలిపెట్టవదని తెలిపారు.

స్వచ్ఛత కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి

ఉట్నూర్ : పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఘన్‌పూర్ పంచాయతీ పరిదిలోని పలు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎంపీపీ పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ కాలాలతో సంబంధం లేకుండా వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఎంపీపీ వెంట గ్రామస్తులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్ : ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ పట్టణ, పరిసర గ్రామాల ప్రయాణికులు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. అలాగే సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలలోపు 9959226003 ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సేవలు ఘనం..పట్టింపు శూన్యం..!

- అరకొర వేతనాలతో ఆశా కార్యకర్తల అవస్థలు
- పనికి తగిన పారితోషికం ఇవ్వడంలో నిర్లక్ష్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సమ్మె బాట
- ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన ఆరోగ్య సేవలు
- సర్కారు స్పందించే వరకు పోరాడుతామంటున్న ఆశాలు

క్షేత్రస్థాయిలో గ్రామీణులకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కనబరుస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలను తూచతప్పక పాటిస్తూ ప్రజారోగ్యం కోసం కృషిచేస్తున్నారు. అరకొర వేతనాలతో అనేక ఏండ్ల పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారు. కానీ ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి కారణంగా ఆశా కార్యకర్తలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పోరాటం చేస్తే తప్పా సమస్యకు పరిష్కారం లభించదని భావించిన ఆశా కార్యకర్తలు సమ్మె బాట పట్టారు. విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో వీరు చేపట్టే రోజువారీ ఆరోగ్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణాల్లో గర్భిణీలకు రక్తపరీక్షలు, చిన్నారులకు టీకాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆశా కార్యకర్తలందరూ సమ్మె బాట పట్టినా ప్రభుత్వం వీరి సమస్య పరిష్కారానికి చొరువ చూపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్యశాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. వీరు చేస్తున్న పనులకు.. వస్తున్న వేతనానికి పొంతనలేకుండా పోతోంది. ఫిక్స్‌డ్ వేతనమంటూ లేకుండా అనేక ఏండ్లుగా సేవలందిస్తున్నా ప్రభుత్వం వీరి పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందనే విమర్శలున్నాయి. గ్రామాలు, పట్టణాల్లోని గర్భిణీలకు నెలవారీగా ఆసుపత్రుల్లో రక్తపరీక్షలు చేయించడం, చిన్నారులకు ఇమ్యూనైజేషన్ టీకాలు వేయించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలనెలా బీపీ, షుగర్ వంటి మందులు అందజేయడం, టీబీ వ్యాధిగ్రస్తుల నుంచి తెమడ సేకరించి పరీక్షలు చేయించడం వంటి పనులు చేస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం పరంగా అదనంగా చేపట్టే ఫీవర్ సర్వే, ఫ్రైడే-డ్రైడే వంటి కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారు. కానీ వీరికి ఫిక్స్‌డ్ వేతనమంటూ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలవారీగా వచ్చే అరకొరవేతనంతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పనికి తగిన పారతోషికం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఏండ్ల తరబడి వెట్టిచాకిరి చేయిస్తున్నా వేతనం మాత్రం పెంచడం లేదని ఆశా కార్యకర్తలు వాపోతున్నారు.

పరిష్కారం కోసం సమ్మెబాట..!

సమస్యలు పరిష్కరించాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని కొన్ని ఏండ్ల నుంచి ఆశా కార్యకర్తలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. పలుమార్లు నిరసనలు చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. దీంతో పోరాడితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించిన ఆశా కార్యకర్తలు ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 8వేల మంది ఆశా కార్యకర్తలు విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నారు. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీరు అందించే ఆరోగ్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్యకార్డులు, ప్రమాద బీమా రూ.5లక్షలు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, సంక్షేమ పథకాలు వర్తింపు, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. టీబీ స్పూటమ్ డబ్బాలను ఆశాలతో మోపించడం రద్దు చేయాలని, 32 రకాల రిజిస్టర్లను ప్రింట్ చేసి సరఫరా చేయాలని, ప్రసూతి సెలవులపై సర్క్యూలర్ జారీ చేయాలని తదితర డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచారు. వీటిని పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేస్తున్నారు.

అరకొర వేతనంతో అవస్థలు : సుజాత, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి



ప్రజారోగ్య కోసం అనేక ఏండ్ల నుంచి కృషిచేస్తున్నాం. కానీ ప్రభుత్వం పనికి తగిన పారతోషికం ఇవ్వడం లేదు. వివిధ రకాల సేవలు అందిస్తున్నా అరకొర వేతనం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. ఫిక్స్‌డ్ వేతనం అందించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారం కోసమే సమ్మె బాట పట్టాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలి.

ఆశా కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలి : అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



కరోనా కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. వీరి సేవలను గుర్తించిన డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అనే అవార్డును ప్రకటించింది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరి చేయిస్తున్నాయి తప్పితే సమస్యలు పరిష్కరించడం లేదు. వీరికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్సు వంటి సౌకర్యాలతో పాటు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి. ప్రభుత్వ చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి.

బిచ్చమెత్తుకునేలా చేస్తున్న ప్రభుత్వాలు

నవతెలంగాణ-దహెగాం



దహెగాం : భిక్షాటనలో అంగన్‌వాడీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుండా బిచ్చమెత్తుకునేలా చేస్తున్నాయని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నాయకురాలు వజ్రమ్మ అన్నారు. 19వ రోజు సమ్మె శిబిరం వద్ద భిక్షాటన కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం, ఉద్యోగభద్రత కోసం 19రోజులుగా నిరసన తెలుపుతూ సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం అంగన్‌వాడీలను అవమానించినట్టేనని అన్నారు. కనీస సమస్యలను కూడా పరిష్కరించిన ప్రభుత్వాలు ప్రజల సమస్యలను ఏ రకంగా పరిష్కరిస్తాయని విమర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, కిశోర బాలికలకు వివిధ రకాల సేవలందిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించుకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, మంజుల, మతమత, లక్ష్మీ, విజయలక్ష్మీ, రూప, ఈశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రెబ్బెన : అంగన్‌వాడీలు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ సమస్యలను పరిష్కరించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి పట్టుదల వీడి జేఏసీ సంఘాలతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వేతనంలో సగం పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. లేనిపక్షంలో వచ్చే నెల 10న ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు, ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, బాలమ్మ, చంద్రకళ, సాంబలక్ష్మీ, ప్రమీల, తిరుపతమ్మ, జి భారతి, శ్యామల, మంజుల, స్వర్ణలత, సంధ్య పాల్గొన్నారు.



రెబ్బెనలో భిక్షాటనలో చేస్తున్న అంగన్‌వాడీలు

తాండూర్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు శుక్రవారం తలలు వంచి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చినట్లయితే ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కుటుంబ తగాదాలతో అన్నదమ్ముల ఘర్షణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కుటుంబ తగాదాలతో సొంత తమ్ముని మీద కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన శుక్రవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిసిన వివరాలు ప్రకారం... మల్లాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు చిలారి పెద్ద మల్లయ్య చిలారి చిన్న మల్లయ్య మధ్య గత కొంత కాలంగా కుటుంబ తగాదాలు ఉన్నాయి. పాత కక్షలు మనసులో పెట్టుకొని శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో నిందితుడు చిలారి పెద్ద మల్లయ్య, అతని కుమారుడు మహేష్ కలిసి కత్తి, రాడ్‌తో చిలారి చిన్న మల్లయ్య మీద దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విషయం తెలిసిన వెంటనే పోలీస్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో పోలీస్ వాహనంలో బాధితున్ని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుని భార్య సిలారి గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..!

- బీజేపీ కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్



నవతెలంగాణ-భైంసా

అభివృద్ధి చేశానని చెప్పుకునే ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్ అన్నారు. మండలంలోని మిర్జాపూర్, సిద్దూర్ గ్రామాల్లో శుక్రవారం పల్లె పల్లెకు బీజేపీ గడపగడపకు మోహన్‌రావు పటేల్ అనే కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాలుగా పేదల ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయకుండా ఎన్నికలు రాగానేమభ్య పెడుతున్నారని ఆరోపించారు. దళితబంధు, మూడు ఎకరాల భూమి, ఎన్ని కుటుంబాలకు ఇండ్లు ఇచ్చావో చెప్పాలన్నారు. మాయ మాటలు చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి సాగనంపాలని అన్నారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తీరుపై ప్రజలు మండిపడుతున్నారని అన్నారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. నేటితో గడపగడపకు మోహన్ రావు పటేల్ అనే కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని 180 గ్రామాల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రధాని మోడీ హయంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిబ్బంది చేపడుతున్న సమ్మెకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 రోజులుగా మున్సిపల్ సిబ్బంది శాంతియుతంగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి సంఘీభావంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లెండుగురె శ్యాంరావు, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆధార్ అప్‌డేట్ చేసుకోనివారు ప్రతి ఒక్కరూ వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని ఈడిఎం గౌతమ్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లోని ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి మండలాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో జిల్లా కేంద్రానికి ఆధార్ అప్‌డేట్ కోసం ఇతర మండలాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారని అన్నారు. వీరందరికి సక్రమంగా ఎలాంటి తప్పులు లేకుండా ఆధార్ అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ధారించిన చార్జీల కంటే అధిక చార్జీలు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వీరి వెంట డిఎం శ్రవణ్, ఆధార్ కేంద్ర నిర్వాహకుడు గడ్డల సురేష్ ఉన్నారు.

డీసీఎంఎస్ వైస్ చైర్మెన్‌కు మంత్రి కేరెడ్డి పరామర్శ

నవతెలంగాణ - కౌటాల

ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్యను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఇంటికెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎంఎల్‌సీ దండె విఠల్ ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.31.40కోట్లు

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో తండాల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి తండాల రోడ్ల నిర్మాణానికి రూ.31 కోట్ల 40 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జీఓ నెంబర్ 260 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తరోడ గ్రామం నుంచి చింతకుంట తండా వయా ఎడ్‌బిడ్ తండా రోడ్డుకు రూ.4 కోట్ల 12 లక్షలు, బాసర రోడ్డు నుంచి తరొడ తాండ రోడ్డు నిర్మాణానికి రూ. ఒక కోటి నాలుగు లక్షలు, వాలేగాం ఎస్టీ కాలనీ నుంచి రంగారి గుడిసెలు రోడ్డుకు రూ.3 కోట్ల 4 లక్షల, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి డొడర్నా 1, 2, 3, 4, 5, తండాలు వాసి బార్డర్ రోడ్డుకు రూ.6 కోట్ల 16 లక్షలు, సిరిపెల్లి తండా నెంబర్ ఒకటి నుంచి సిరిపెల్లి తండా నంబర్ 3 రోడ్డుకు రూ.3 కోట్ల 68 లక్షలు, పార్డి(బి) నుంచి హల్దా రోడ్డుకు రూ.1 కోటి 82 లక్షలు, వీరేగావ్ తండా నుంచి శివుని తండా వయా హల్ద తండా రోడ్డుకు రూ.2 కోట్ల 84 లక్షలు, శివుని రోడ్డు నుంచి శివుని తాండ రోడ్డుకు రూ.60 లక్షలు, పల్సి తండా నుంచి కసర తండా రోడ్డుకు రూ.2 కోట్ల 74 లక్షలు, అంబుగాం నుంచి మహారాష్ట్ర బార్డర్ రోడ్డుకు రూ.కోటి 76 లక్షలు, కుంటాల నుంచి కుంటాల తండా రోడ్డుకు రూ.కోటి 54 లక్షలు, బాలాజీ నగర్ (లోకేశ్వరం) నుంచి జిల్లా పరిషత్ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల ఆరు లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో శుక్రవారం నేరడిగొండలోని తన నివాసంలో యువకులు పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ యువకులు పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై నాపై ఉన్నా అభిమానంతో పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్



అభ్యర్థిగా విజయానికి సైనికుల్ల పని చేసి గెలిపించుకునే బాధ్యత యువతపైనే ఉందన్నారు. నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రాములు, పలువురు యువకులు ఉన్నారు.

భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ

నవతెలంగాణ-బాసర

గోదావరి తీరం వద్ద గణనాథుల నిమజ్జనానికి వచ్చిన భక్తులకు శుక్రవారం మండల కేంద్రానికి చెందిన అయోధ్య యూత్ సభ్యులు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. పోలీసులు వన్ వే ను ప్రవేశపెట్టడంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా నుంచి వచ్చిన భక్తులు గణనాథులను నిమజ్జనం చేసిన అనంతరం గోదావరి ఘాట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో భక్తులకు ప్రయాణికులకు దహం తీర్చేందుకు ఉచితంగా వాటర్ ప్యాకెట్లు, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయోధ్య యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన



బాసర : భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధనకు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. శుక్రవారం అందులో భాగంగానే మండల కేంద్రంలో బిక్షాటన చేస్తు తమ నిరసనను తెలియజేశారు. గ్రామపంచాయతీలో, తహసీల్దార్ కార్యాలయంలో బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సుభద్ర, అర్జునే మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించేందుకు చర్చలు జరపాలని అన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ తమ నిరసనను కొనసాగించారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ ఉద్యోగులు హెచ్.సుభద్ర, కమల, ఆత్రం నాగుబాయి పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వేస్టేషన్, ఆలయ పరిసరాల్లో తిరుగుతూ షాపులలో భిక్షాటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై స్పదించకపోవడంతో ప్రజలకు తమ సమస్యలను తెలియజేయాలనే ఉద్యేశంతో భిక్షాటన కార్యక్రమం చేపట్టినట్టు సీఐటీయూ మండల అధ్యక్షురాలు రాజియా అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఇంటి అద్దె బకాయిలతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

తాంసి : తమ న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు గత 19 రోజులుగా మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్నారు. శుక్రవారం గ్రామ వీధుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, కిరాణా దుకాణల్లో, బ్యాంక్‌లో బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు తమవంతుగా ధర్నాలు, రాస్తారోకోల్లో పాల్గొన్నామని అన్నారు. మా వేతనాల పెంపుతో పాటు మా డిమాండ్ల సాధనకు గత 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా, సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సంబంధించిన పనులు చేయడమే కాకుండా ఓటరు నమోదు, జనాభా లెక్కలు వంటి అనేక పనులు చేయడం జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో మా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మంగళ, విఠాబాయి, బాగిర్థ, గడుగు దేవమ్మ, విజయలక్ష్మీ, గంగమ్మ, ఆయాలు ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె శుక్రవారంతో 19వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా బస్టాండ్ వరకు వెళ్లారు. అనంతరం పలు షాపుల్లో తిరుగుతూ బిక్షాటనలో పాల్గొన్నారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో అంగన్‌వాడీలు కుటుంబాన్ని నడుపుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయడంలో విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు మధునిక, పార్వతి, సుజాత, కవిత, ప్రియాంక, కళావతి భోజ్జమ్మ, గంగామణి, జంగుబాయి, గంగమ్మ పాల్గొన్నారు.

తలమడుగు : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు పలు డిమాండ్ల సాధన కోసం ఏకధాటిగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు వర్షంలో తడుస్తూ, బిక్షాటన చేసి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్న ఉద్యోగుల పట్ల మొండి వైఖరి విడనాడి సీఎం కేసీఆర్ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. బిక్షటనలో అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మల్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 19 వ రోజుకు చేరుకుంది. భిక్షాటన చేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రాజమణి మాట్లాడారు. గత 19 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా లాంటి పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాలు రమాదేవి, శైలజ, శశికళ, హేమలత, దేవి, లావణ్య, సావిత్రి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : నర్సాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నిరవధిక సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగ అధ్యక్షురాలు గంగామణి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు పెంచాలని గ్రావిటీని అమలు చేసి, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.



ఆదిలాబాద్‌టౌన్ : కొంగుచాచి భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రెండో రోజుకు చేరిన కార్మికుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. శుక్రవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టి సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణ అక్షయ పాత్రలాంటిదని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని అన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే అవసరమైన గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని, అక్రమ తొలగింపును అరికట్టాలని అన్నారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చిరు వ్యాపారస్తులకు చేయూత



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని చిరు వ్యాపారస్తులకు ఉచితంగా గోడుగులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్, ఆదేశాల మేరకు పట్టణంలోని వీధి వ్యాపారస్తులకు, ఎండ, వర్షం తాకిడి నుంచి తట్టుకునే గొడుగులను అందించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా మరిన్ని సేవ కార్యక్రమాలను నిర్వహించేందకు తగు కార్యచరణతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు రషీద్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి సీతారాం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొల్లూరి స్వామి, నాయకులు కాటం రమేష్, సౌకత్ అలీ, ముజీబ్ ఖాన్, కుటికల ఆశన్న, ముంజం అనుదీప్, రవీందర్, సోనే రావు, రాంరెడ్డి ఉన్నారు.

జంతువుల పట్ల అందరూ ప్రేమను చూపాలి



నవతెలంగాణ-బోథ్

జంతువులను ప్రతి ఒక్కరూ ప్రేమగా చూసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బోథ్ వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో భాగంగా జంతువుల ప్రేమికుడి లక్ష్మణ్ మొల్లేటి రాసిన జర్నీ ఆఫ్ బంటి పుస్తకం ద్వారా జంతువులతో ప్రేమగా ఉండాలన్నారు. పుస్తకాలను అన్ని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారని అన్నారు. ప్రతి పాఠశాలలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ విద్యాసంస్థలకు వందగజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను వాడటం నేరమని, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఐదు పాఠశాలను గెజిటెడ్-1 హైస్కూల్, ప్రైమరీ స్కూల్, రిజర్వుడ్ పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి శిశుమందిర్ వినాయక్ చౌక్, న్యూహౌసింగ్ బోర్డ్ పాఠశాలలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు, ధూమపానానికి, మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాలలకు 100 గజాల పరిధిలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం పొగాకు రహిత విద్యాసంస్థల నియమావళి ప్రకారం నేరమన్నారు. నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి శుక్రవారం నిర్మల్ వస్తుండగా, నిజామాబాద్‌లో బస్సు ఎక్కిన ఒక మహిళ ప్రయాణికురాలు సెల్ ఫోన్ మరిచిపోయి పోచంపాడ్ ఎక్స్ రోడ్ వద్ద దిగి పోయింది. పోచంపాడ్‌లో ఎక్కిన ప్రయాణికులకు టికెట్లు ఇస్తూ, వెనకాలకు వెళ్లివస్తున్న కండక్టర్‌కు సెల్ ఫోన్ కనబడింది. బస్‌లో దొరికిన సెల్ ఫోన్ నిర్మల్ బస్టాండ్ లోని స్టేషన్ మేనేజర్‌కు అప్పగించారు. ఆ ఫోన్‌కు ఫోన్ రావడంతో ఈ ఫోన్ బస్సులో దొరికిందని, నిర్మల్ బస్టాండ్ వచ్చి సెల్ ఫోన్ తీసుకెళ్లండని స్టేషన్ మేనేజర్ తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికురాలు వెనకాల వస్తున్న మరో బస్సులో ఎక్కి నిర్మల్ బస్టాండ్‌కు చేరుకుని స్టేషన్ మేనేజర్ జి.ఎస్.నారాయణ, కంట్రోలర్ కే.అంజయ్య సదరు ప్రయాణికురాలికి సెల్ ఫోన్‌ను అప్పగించారు. నిజాయితీతో సెల్ ఫోన్ తీసుకువచ్చి అప్పగించిన డ్యూటీ కండక్టర్ కే.జి.రామ్‌ను డిపోమేనేజర్ ప్రతిమరెడ్డి పలువురు అభినందించారు.

రబీంద్రలో ప్రపంచ గుండె దినోత్సవం

నవతెలంగాణ-ముథోల్



మండల కేంద్రంలోని రబింద్రా ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ గుండె దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ గుండె మనిషికి ప్రధానమైనదని అన్నారు. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యకరమైన అలవాట్ల అలవర్చుకుంటూ యోగ వ్యాయామం చేస్తూ ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు గుండె ఉపయోగం ఆరోగ్యకరమైన సూత్రాలు ఆహార అలవాట్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చే నెల 4, 5వ తేదీలలో జిల్లాలో పర్యటించి, పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో పర్యటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, లక్ష్మి నరసింహ 27వ ప్యాకేజీ పనులను, హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ మోహన్, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఎంపీఓ అజీజ్‌ఖాన్, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కోడె నవీన్, ఏలాల చిన్నారెడ్డి ఉన్నారు.

కళాశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈఓ పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం, పరిశీలించారు. అలాగే అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి సిలబస్ తదితర వాటిపై చర్చించి, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కైసర్ పాషా, అధ్యాపకులు గోపాల్, శ్రీనివాస్, గంగాధర్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ర్యాలీ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాల నిరసన

నవతెలంగాణ-ఇచ్చోడ

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆశా కార్యకర్తల సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా, ఇచ్చోడ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పవార్ జితేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలను పరిష్కారం చేసే విషయంలో మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో పాటు ప్రగతి భవనం ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల మండలం అధ్యక్షురాలు లక్ష్మి, ఆశల యూనియన్ కార్యకర్తలు సుశీల, లలిత, సునీత, సురేఖ, వనితా, అమల, అనుసూయ, భీమ్‌బాయి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : కరోనా సమయంలో ఎనలేని సేవలందించిన ఆశ వర్కర్లను ప్రభుత్వ గుర్తించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె శుక్రవారంతో 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నిర్మల్ : తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆశాలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకురాలు చంద్రకళ మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేలు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి పలు డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగ్య, సుజాత రామాలక్ష్మి, వర్ష, శ్రీదేవి, అనురాధ, ఇంద్రజ, సుశీల, స్రవంతి, లక్ష్మి పాల్గొన్నారు.

దళితబస్తీలో అక్రమాలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలం పాటన్ గ్రామంలో లబ్ధిదారులకు అందించిన దళితబస్తీ భూముల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవిని కలిసి ఫిర్యాదు చేశారు. పాటన్ గ్రామానికి చెందిన కాడే వర్ష అనే మహిళ ప్రభుత్వ అసైన్డ్ భూమిని తనదిగా చెప్పుకొని, దళిత బస్తీ పథకంలో విక్రయానికి పెట్టారని తెలిపారు. దీంతో సర్వే నెంబర్ 32/2లోని ఈ భూమి కొబ్బయి గ్రామానికి చెందిన కొంద్రావార్ రేఖబాయి లబ్ధిదారుకు అధికారులు కేటాయించారని పేర్కొన్నారు. కాగా దళితబస్తీ పథకంలో ప్రభుత్వ భూమిని పెట్టిన కాడే వర్షకు 3 ఎకరాలకు గాను ప్రభుత్వం రూ.15 లక్షలు చెల్లించిందన్నారు. అయితే దళిత బస్తీలో భూమి పొందిన లబ్ధిదారుకు ఇది అసైన్డ్ భూమి కావడంతో పట్టా కావడం లేదని లబ్ధిదారుకు రైతుబంధు, రైతుబీమాతో పాటు ఇతర



పథకాలు అందడం లేదని వివరించారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అడుగుతే ఇది అసైన్డ్ భూమి అని అధికారులు సమాచారం ఇచ్చారని, ఇదే విషయం మండల రెవెన్యూ అధికారికి తెలిసిన ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి, అక్రమాల్లో భాగం పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యపై సమగ్ర దర్యాప్తు చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకొని అసలైన లబ్ధిదారుకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేల మండలం ఎస్టీ సెల్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాపూరావు, ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాందేవ్, మోహన్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో జోస్-2023-24 పేరిట జిల్లాస్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు మార్గదర్శం చేశారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ క్రీడల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని 687 మంది విద్యార్థులు పాల్గొననున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చాట్ల లక్ష్మీ రమేష్, డిప్యూటీ కలెక్టర్ కిషన్ కుమార్, హజ్ కమిటీ సభ్యులు నజీర్, డీఎండబ్ల్యుఓ మోహన్, జిల్లాస్థాయి అధికారి కెప్టెన్ సలీమొద్దీన్, విజిలెన్స్ అధికారులు రవిచరణ్‌దాస్‌రెడ్డి, తాజొద్దిన్, ప్రిన్సిపాల్ మహేష్, పీఈటీలు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | సెప్టెంబర్ 30, 2023 | www.navatelangana.com

ఆదిలాబాద్ ఎంపీ టికెట్ తనకే కేటాయించాలి

- కేంద్ర మంత్రికి మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాబోయే ఎంపీ ఎన్నికలలో బీజేపీ తరపున ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను తనకే కేటాయించాలని కోరుతూ శుక్రవారం మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ కేంద్ర పశుసంవర్ధక శాఖా మంత్రి రూపాలాకు వినతిపత్రం ఇచ్చారు. 1978లో తాను ఎస్టీ నియోజకవర్గమైన బోథ్ నుండి ఎమ్మెల్యేగా గెలిచి, 1981 ప్రభుత్వ విప్‌గా, 1982లో టూరిజం శాఖా మంత్రిగా కొనసాగానని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన తనకు ఎంపీ టిక్కెట్ కేటాయించాలని కోరారు.



సమ్మె శిబిరాల సందర్శన

కాగజ్‌నగర్ : తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమ్మె శిబిరాలను శుక్రవారం బీజేపీ నాయకులు సందర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడీకి గురి చేస్తోందని అన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న కేసీఆర్ విధానాలను తిప్పికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, సర్పంచ్ ధోతుల శ్రీనివాస్, నాయకులు మాచర్ల శ్రీనివాస్, కొండ తిరుపతి, చేరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారంలోకొస్తే ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేస్తాం

- అంగన్‌వాడీ, ఆశాల సమస్యలు పరిష్కరించాలి
- టీపీసీసీ సభ్యుడు కోరెళ్ల కృష్ణారెడ్డి



నవతెలంగాణ - బెజ్జూర్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ స్కీంలు అమలు చేస్తామని పీసీసీ సభ్యుడు కోరెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు మద్దతు పలికి మధ్యాహ్నభోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఆరు గ్యారెంటీ పథకాలకు మంచి ఆదరణ ఉందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సిర్పూర్ తాలుకా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ కన్వీనర్ అల్లూరి రాజు, మండల అధ్యక్షుడు దేవనపల్లి సత్తయ్య, సిర్పూర్ మండల అధ్యక్షుడు శంషుద్దీన్, పెంచికల్‌పేట్ మండల అధ్యక్షుడు అతాహబేగ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు ఇబ్రాయిల్, నాయకులు శైలేష్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పటిష్ట చర్యలు

- జడ్పీటీసీ నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడలాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, అధికారుల సహకారం అవసరమని జడ్పీటీసీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గిరిజన క్రీడ పాఠశాలలో డివిజన్ స్థాయి ఆశ్రమ పాఠశాలల పోటీల ప్రారంభోత్సవానిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో క్రీడా పాఠశాల ఏర్పాటుతో మంచి క్రీడాకారులు తయారవుతున్నారని, క్రీడల ద్వారా మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆసిఫాబాద్ డివిజన్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, క్యారం, చెస్, ఆర్చరీ క్రీడాంశములలో జూనియర్ సీనియర్ విభాగంలో ఎంపిక పోటీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ క్షేత్రయ్య, ఏసీఎంఓ ఉద్ధవ్, గిరిజన క్రీడలాధికారి మీనారెడ్డి, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, పీడీ, పీఈటీలు మధుసూదన్, లక్ష్మణ్, సుభాష్, గోకుల్, శ్రీనివాస్, సుమలత, ఇందిర పాల్గొన్నారు.

అటవీ నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అటవీ నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5లోపు వేతనాలు చెల్లించాలని, రేపల్లెవాడలో పనిచేస్తున్న కార్మికులకు రూ.3లక్షలపైగా వేతనాలు చెల్లించాల్సి ఉందని, వెంటనే వాటిని చెల్లించాలన్నారు. వీటితో పాటు ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే రానున్న రోజుల్లో జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, తెలంగాణ నర్సరీ ఫారెస్ట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సుధాకర్, యశోద, భాగ్యలక్ష్మి, శకుంతల, సంతోషి, కమల, నజీరా, వహీదా, సుల్తానా పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పెంచికల్పేట్ నుండి కాగజ్‌నగర్ వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని వల్లకొండ వద్ద టాటా ఏసీ వాహనం ఢీకొట్టింది. షేక్ అబ్దుల్ రియాజ్‌కు చెందిన టాటా ఏసీ వాహనం ఎక్సెల్ వాహనాన్ని ఢీకొనగా వాహనంపై ఉన్న పోడూరి వెంకటేశం, పొట్టే గణపతి గాయాలపాలయ్యారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామన్‌కుమార్ తెలిపారు.

మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- కౌటాల, చింతలమానేపల్లిలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



కౌటాలలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ - కౌటాల

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్ అని అటవీ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా మొగడ్‌దగడ్ నుండి వైగాముకు రోడ్డుకు, 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం భూమిపూజ చేశారు. గుండాయిపేట్, మహారాష్ట్రలోని నందివర్ధ మధ్యగల వార్ధా నదిపై రూ.75 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ అంతర్‌రాష్ట్ర వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. చింతలపాటి, కోయగూడ రోడ్డుకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎంఎల్‌సీ దండె విఠల్‌తో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాలకు 80 నుండి 90 స్థానాలు బీఆర్ఎస్ గెలువబోతుందన్నారు. నెంబం "వన్ అసెంబ్లీ స్థానం సిర్పూర్(టి), నెంబర్ వన్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను అత్యధిక మెజార్టీతో గెలుపించాలని, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తే విజయం మనదేనని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కలెక్టరేట్ ప్రారంభానికి వచ్చినప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, వార్ధా నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేసి తీరుతామన్నారు. ఎంఎల్‌సీ దండె విఠల్ మాట్లాడుతూ కోనేరు కోనప్ప జన్మభూమి, కర్మభూమి ఇక్కడేనని అన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమం మరిచి అవినీతి ఆరోపణలు చేస్తున్న నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మంత్రి ఐకే రెడ్డి సమక్షంలో సుమారు వెయ్యి మంది వరకు బీఆర్ఎస్‌లో పలు పార్టీల నుండి చేరారు. వారిని మంత్రి, ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, డుబ్బుల వెంకన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి పాల్గొన్నారు. శిలాఫలకాలను ఆవిష్కరిస్తూ భూమిపూజ చేశారు. రవీంద్రనగర్-2 గ్రామ సమీపంలో 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేశారు. రూ.2.65కోట్లతో చింతలమానేపల్లి నుండి గంగపూర్ వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.1.95కోట్లతో కర్జెళ్లి నుండి బారేగూడ రోడ్డుకు, రూ.3కోట్లతో దిందాలో లోలెవల్ వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య, జడ్పిటిసి డబ్బుల శ్రీదేవి, వైస్ ఎంపీపీ మనోజిత్, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌రావు, వి.వాసుదేవ్, సిఐ సాదిక్ పాషా, ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.



చింతలమానేపల్లి : శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు సిర్పూర్(టి) జెడ్పీటీసీ రాజీనామా



రాజీనామా పత్రంపై సంతకం చేస్తున్న జెడ్పీటీసీ నేరేటి రేఖ

నవతెలంగాణ - సిర్పూర్(టి)

జెడ్పీటీసీ నేరేటి రేఖ బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మండలంలోని కొంతమంది నాయకుల ఆధిపత్యం నచ్చక బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జెడ్పీటీసీ, జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ నేరేటి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము తెలంగాణ ఉద్యమకాలం నుండి పార్టీ నిబంధనలకు లోబడి పని చేస్తున్నామన్నారు. 2014 నుండి 2018 వరకు ఎంపీపీగా, 2018 నుండి జెడ్పీటీసీగా పనిచేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కేవలం ఒక నాయకుడు చెప్పిన మాటలు విని మండల అభివృద్ధికి సహకరించడం లేదని తెలిపారు. సిర్పూర్ మండలానికి ఎమ్మెల్యే క్వార్టర్ మంజూరైనప్పటికీ ఇక్కడ నిర్మించకుండా కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారన్నారు. ఏకలవ్య ఆశ్రమ పాఠశాలను కూడా నిర్మించకుండా కేవలం తన స్వలాభం కోసం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్మించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన హుడ్కిళి, లోనువెల్లి ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంటలు పండించిన రైతులు ప్రస్తుతం అవి పనిచేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై పలుమార్లు ఎమ్మెల్యేకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం, మండల అభివృద్ధికి సహకరించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే సిర్పూర్ అసెంబ్లీ స్థానం మొదటిదని, కానీ ఇక్కడ కనీసం బస్టాండ్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. ఎమ్మెల్యే చూపుతున్న వివక్ష, ప్రజల ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడికి ఫ్యాక్స్ ద్వారా పంపించామని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్నట్టు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పాల్వాయి హరీష్‌బాబు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

కాగజ్‌నగర్ : సిర్పూరు (టి) నియోజకవర్గంలో కొనసాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కోరారు. సిర్పూరు (టి) జెడ్పీటీసీ నీరటి రేఖ-సత్యనారాయణ దంపతులు శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, హైద్రాబాద్‌లో బీజేపీలో చేరేందుకు వెళుతున్న సందర్భంగా కాగజ్‌నగర్‌లో వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుండి మొదలుకొని లారీ చౌక్, రాజీవ్‌చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి రాజీవ్ చౌక్ చేరుకుంది. పలు చౌరస్తాలలో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఒక్క ఎకరానికి నీళ్లిచ్చిన పరిస్థితులు లేవని అన్నారు. చేతకాని పాలకులను ఎన్నుకుంటే ఇదే పరిస్థితి ఉంటుందని విమర్శించారు. రాజీనామా చేసిన రేఖ-సత్యనారాయణ దంపతులు మాట్లాడుతూ సిర్పూరు మండలంలో అభివృద్ధిని అడ్డుకున్నది ఎమ్మెల్యేనేనని అన్నారు. శనివారం తాము బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగులో సందేహాలుంటే సంప్రదించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రైతులు తమ పంటల సాగు, రుణమాఫీ పట్ల ఎలాంటి సందేహాలున్నా తమను సంప్రదించాలని కాగజ్‌నగర్ వ్యవసాయాధికారి రామక్రిష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని రాస్పల్లి, గజ్జిగూడ గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. బ్యాంక్ లోన్ తీసుకున్న ప్రతి రైతులోన్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. రైతులకు రుణ మాఫీపై ఎలాంటి సమస్యలున్నా ఏఓ లేదా ఏఈఓలను కలిసి సందేహాలు అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పత్తి, వరి పంటకు వాడాల్సిన మందులను వివరించారు. రాస్పల్లిలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి రైతులకు అవసరం లేని పురుగు మందులు ఇచ్చి ఇబ్బంది



పెడితే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని, వేప నూనె పిచికారి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

ఆశాలకు భరోసా కల్పించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



ధర్నా చేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశా వర్కర్లకు ప్రభుత్వం భరోసా కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రజానేస్తాలని, గ్రామీణ, పట్టణ ప్రజల ఆరోగ్యానికి మూల స్తంభాలుగా నిలుస్తున్నారని తెలిపారు. పౌష్టికాహారం, పారిశుధ్యం, ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి ప్రతిరోజు ప్రజలకు వివరిస్తున్నారని అన్నారు. సురక్షిత ప్రసవం, తల్లిపాల ప్రాధాన్యం, శిశు సంరక్షణ వివిధ రకాల వ్యాధుల పట్ల చైతన్యం కల్గిస్తున్నారని తెలిపారు. కోవిడ్ కాలంలోనూ ప్రాణాలను లెక్కచేయకుండా పని చేశారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేల జీతం చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, యశోద, సుమిత్ర, సురేఖ, రేణుక, శోభ, వాణి, నాగమణి, సుమిత్ర, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

ఫారెస్టు నర్సరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



ఎఫ్ఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న బోగె ఉపేందర్, కూలీలు

నవతెలంగాణ-రెబ్బెన

జిల్లాలోని ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఫారెస్టు నర్సరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రెబ్బెన ఎఫ్ఆర్ఓ నిజాంమొద్దీన్‌కు మండలకేంద్రంలోని నర్సరీలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 10 సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఫారెస్టులోని మొక్కలను కాపాడడంలోనూ కూలీలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నోసార్లు చెప్పిన పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో డీఎఫ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, అలాగే రవాణా సౌకర్యం కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలుచేయాలన్నారు. నర్సరీ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నర్సరీ ఫారెస్టు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు మాయ, కోశాధికారి సుజాత, నాయకులు ఆనంద్, కౌసల్య, శంకరమ్మ, పద్మ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చక్రపాణి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో నైపుణ్యం కలిగి ఉండాలని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి సూచించారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని 14 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం డివిజన్ స్థాయి క్రీడా పోటీలను స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించగా, ఈ పోటీలను ప్రిన్సిపల్ చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని అన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి, క్రీడలలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అండర్-14, 17 విభాగాల వారీగా జిల్లా స్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఏటీడబ్ల్యుఓ ఖమర్‌హుస్సేన్, ప్రత్యేక ఆహ్వానితులు పూర్ణచందర్‌రావు, ఎం రాధాకిషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్, గోపాల్, అశోక్‌కుమార్, కన్వీనర్ సిహెచ్ ప్రసాద్, సీఆర్‌టి విజేష్, హెచ్‌డబ్ల్యుఓలు, ఆశ్రమ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టిఎస్ఆర్టిసి ఆసిఫాబాద్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆసిఫాబాద్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏమైన సమస్యలు ఉంటే 9959226006 నంబర్ ద్వారా దృష్టికి తేవాలని, అదేవిధంగా అమూల్యమైన సలహాలను అందించాలని కోరారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-తాండూర్



పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం రాజారాం అన్నారు. శుక్రవారం తహసీల్దార్ రోహిత్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెం.8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్‌తో పాటు సబ్సిడీపై గ్యాస్ ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రధామ భీమా, గుర్తింపు కార్డులను అదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మల్లక్కబొల్లి సరోజ, వసంత పాల్గొన్నారు.

సెక్యూరిటీ జీఎంకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



బెల్లంపల్లి రీజియన్ పర్యటనలో భాగంగా జీఎం (సెక్యూరిటీ) బిఆర్ దీక్షితులు శ్రీరాంపూర్ ఏరియాకు విచ్చేసిన సందర్భంగా ఏరియా జీఎం సంజీవరెడ్డి శాలువాతో సన్మానించారు. అనంతరం అధికారులతో సింగరేణి ఆస్తుల పరిరక్షణ, సింగరేణి సెక్యూరిటీ పోస్టులు, ఓసిలలో డీజిల్ బంకుల స్థితిగతులు, రక్షణ గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ప)అరవింద్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు సర్వే నిర్వహించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాలలో వైరల్ జ్వరాల నివారణకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ఐద్వా జిల్లాధ్యక్షురాలు పోతు విజయ కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఐద్వా నాయకులతో కలిసి మండలంలోని వినాయక్‌నగర్, శ్రీలంక కాలనీ, రాంనగర్ తదితర కాలనీలో పర్యటించి జ్వర బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. కురుస్తున్న వర్షాలకు దోమలు, ఈగలు విజృంభించి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి ప్రాణాంతకరమైన వ్యాధులు వస్తున్నాయన్నారు . ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

మాదిగలకే టికెట్లు కేటాయించాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలో మాదిగలగకే టికెట్ల కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య మట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మొదలుకొని నేటి వరకు బెల్లంపల్లి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఏ పార్టీ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు మాదిగలకు నియోజకవర్గం సీటు కేటాయించాలని కోరారు. బెల్లంపల్లి స్థానాన్ని మాదిగలకు కేటాయించినట్లయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మద్దతు తెలుపుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లారపు చిన్నరాజన్న, మంతెన మురళీ, రాజలింగు, గోగర్ల శేఖర్, శంకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చేసిన అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని 42 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను అధికారులు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శబరిమలైకి మహా పాదయాత్ర

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణానికి చెందిన చంద్రగిరి రమేష్ కన్నా శబరిమలైకి నాలుగోసారి మహా పాదయాత్రగా శుక్రవారం బయలుదేరి వెళ్లారు. స్థానిక కోదండ రామాలయం రమేష్ గురు స్వామి ఆధ్వర్యంలో మాల స్వీకరించి, శబరికి సుమారు 1800 కిలోమీటర్ల వరకు పాదయాత్రగా వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిలోని అయ్యప్పస్వామి దేవాలయాన్ని నవంబర్‌లో దర్శించుకోనున్నానని, తాను చేస్తున్న యాత్రకు సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MANCHERIAL
O.S. No. 289 of 2023

Between:-
Narmetla @Narinetta Meghana and another
...Plaintiffs
//AND//
The General Manager, SCCo. Ltd, Mandamarri Area and others
... Defendants
To
To whom so ever it may concern.
Whereas the above named plaintiffs have filed the above suit against the defendants for declaration of status of the plaintiffs as daughter and son of deceased Narinetta Lingamurthy, S/o Rajam, Occ: Coal Cutter in Shanthikhani Mine, E.C.No.0207524, SCCo. Ltd, Mandamarri Area and to record their names in all concerned records as class I legal heirs and also to provide dependant job to the plaintiff no.2. The said suit stands posted to on: 06-10-2023 for appearance.
Hence, if any person/s has/have any interest in the above case, may appear before the Court on: 06-10-2023 at 10-30 A.M., either in person or through an advocate duly authorized, and to answer the claim. Failing which, the matter will be heard and determined according to law.
// BY the Order of Court//
Date: 29-09-2023
Place: Mancherial
sd/-
N. Ravi Teja Reddy
N. Mahender
Advocates, Mancherial
Cell No.9494357363

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MANCHERIAL
O.S. No. 320 of 2023

Between:-
Danam Prasanna and others
... Plaintiffs
//AND//
SCCo. Ltd, rep by its GM Srirampur and others
...Defendants
To
To whom so ever it may concern.
Whereas the above named plaintiffs have filed the above suit against the defendants for declaration of status of Plaintiffs as Class I legal heirs of the deceased Danam Sadanandam. The said suit stands posted to on: 17-10-2023 for appearance.
Hence, if any person/s has/have any interest in the above case, may appear before the Court on: 17-10-2023 at 10-30 A.M., either in person or through an advocate duly authorized, and to answer the claim. Failing which, the matter will be heard and determined according to law.
// BY the Order of Court//
Date: 29/09/2023
Place: Mancherial
sd/-
N. Ravi Teja Reddy,
M. Bhavani &
N. Mahender
Advocates, Mancherial
Cell No.9494357363

దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ - హాజీపూర్

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) బి.రాహుల్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ క్రమంలో 191 మంది దివ్యాంగ విద్యార్థులకు 291 దివ్యాంగ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దివ్యాంగుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ఈ నేపథ్యంలో 4 వేల 16 రూపాయల పెన్షన్ అందిస్తుందని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాలను దివ్యంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగుల తల్లిదండ్రులు, సమాజంలో దివ్యాంగులలో ధైర్యాన్ని నింపుతూ వారి కాళ్ల మీద వారు నిలబడేలా సహకరించాలని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల అలిమ్-కో సంస్థ చూపుతున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. భవిత కేంద్రాలు ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నాయని, దివ్యాంగ విద్యార్థులకు అన్ని విధాలుగా చేరుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని, దివ్యాంగులకు అందే వివిధ సహాయాలను అందించడానికి ప్రతి భవిత కేంద్రంలో ఐఆర్‌పిలు ఉన్నారని, వారి ద్వారా వివిధ సేవలు పొందేలా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు 78వినికిడి పరికరాలు, 25 చక్రాల కుర్చీలు, 36 సిపి కుర్చీలు, 16 రొలేటర్స్, 20 చంక కర్రలు, 5 బ్రెయిలీ కిట్స్, 2 సుకన్య కేన్ కిట్స్, 93 ఎంఎస్ఐ ఈడి కిట్స్, 9పుట్ ఆర్థోసిస్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, మంచిర్యాల ఎంఈఓ జాడి పోచయ్య, 18 మండలాల ఐఆర్‌పిలు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేటీఆర్ రాకకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలి



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు నల్ల రిబ్బన్లతో నిరసనలు తెలియజేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ)శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో కాంట్రాక్ట్ కార్మికులతో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని గోదావరిఖని బహిరంగ సభలో కేటీఆర్ హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అక్టోబర్ 1న మందమర్రి పర్యటనకు వస్తున్న కేటీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఏ విధంగా వస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను 2021 జూన్‌లో విడుదల చేసి, ఇప్పటివరకు గెజిట్ చేయకుండా కార్మికులపై నిర్లక్ష్య వైఖరి చూపిస్తుందన్నారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కార్మికులకు చేసిందేమి లేదన్నారు. హామీలు తప్ప ఆచరణలో వాటిని తీసుకురావడం లేదని మండిపడ్డారు. పర్యటన కంటే ముందే హామీలను నెరవేర్చి రావాలన్నారు. వేతనాలు పెంచకుండా వస్తే, ఎక్కడికి అక్కడ కార్మికులు నల్ల రిబ్బన్‌లతో నిరసన తెలియజేస్తూ అసహనాన్ని చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు సమ్మయ్య, నరేష్, సంపత్, శ్రీను, రాజేందర్, సన్ని, సురేష్ పాల్గొన్నారు.

పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-హాజీపూర్



మంచిర్యాల పట్టణంలో మహాత్మ పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటూ బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావుకు విన్నవించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలోని మెజారిటీ వర్గాల సంక్షేమం కోసం రెండు శతాబ్దాల క్రితమే ఉద్యమించిన మహాత్మ జ్యోతిరావు పూలేను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు గౌరవిస్తారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మెజారిటీ వర్గాల వెనుకబాటుకు కారణమైన కుల దురహంకార దౌర్జన్యాలను తన 'గులాంగిరీ' పుస్తకం ద్వారా తెలియజెప్పడమే కాకుండా 'సత్యశోధక్ సమాజ్' సంస్థను స్థాపించి మెజారిటీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికి నడుం కట్టిన మహాత్ముడని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు పూలే గొప్పతనం గురించి, ఆయన చేసిన త్యాగాల గురించి, సామాజిక న్యాయ ఆవశ్యకత గురించి చెప్పాలంటే మహాత్మా పూలే విగ్రహం మన పట్టణంలో ప్రతిష్ఠితం కావాలని తెలిపారు. బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మా పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, ఆ ప్రాంతాన్ని పూలే చౌరస్తాగా నామకరణం చేయాలని కోరారు. దేశంలో ఆర్మీ ఏర్పడక ముందే, దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ముందే దేశ ప్రజల నిజమైన స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన మహాత్ముడు పూలే అని తెలిపారు. ఆర్మీ జవానులు సైతం సెల్యూట్ చేసే దైవసమానుడు పూలే అని గుర్తు చేశారు. బెల్లంపల్లి చౌరస్తాలో వేరే విగ్రహాలు పెడితే మంచిర్యాల ప్రజల అభీష్టానికి వ్యతిరేకమే అవుతుందని తెలియజేశారు. ఆలస్యం చేయకుండా సత్వరమే మహాత్మా పూలే విగ్రహాన్ని మంచిర్యాలలో ప్రభుత్వ నిధులతో ప్రతిష్ఠించాలని కోరారు. ప్రతిస్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి సత్వరమే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్య వేదిక కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్, సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సమ్ము రాజన్న, బుద్దె చంద్రమౌళి, మిడివెల్లి రాజ్‌కుమార్, కోగిల వెంకటేశం, విజయగిరి శంకరయ్య, చుంచు రాజేశం వివిధ బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఉద్యమించాలి



- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు

నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యలపై ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమించాలని, అప్పటి వరకు పార్టీ పరంగా అండగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హక్కుల సాధన కోసం అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రమాద భీమా రూ.10లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు, కేసీఆర్ అసెంబ్లీలో కార్మికులను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పి ఇప్పటి వరకు వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు సీఐటీయూ మండల అధ్యక్షుడు కే బుచ్చయ్య దీక్షలో కూర్చుని మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసిఉల్లా, ఎంపీటీసీ కరుణాకర్, బీసీ సెల్ అధ్యక్షుడు రాజన్న యాదవ్, వార్డు మెంబర్ గంగన్న, నాయకులు నర్సింగరావు, గాబ్రియల్, మంద రాజేష్, అబ్దుల్ ముజు, గొర్రె మహేష్, పి శ్రీనివాస్, రాహుల్, అంగన్‌వాడీలు తోకల సరస్వతి జమున జయ, బండ విజయ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ధర్మారం గ్రామానికి చెందిన మగ్గిడి చంద్రశేఖర్(30) బైక్ గ్రామ సమీపంలోని పొలంలో పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై పి.సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మగ్గిడి చంద్రశేఖర్ గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై జన్నారం వెళ్లి వస్తానని బయలుదేరాడు. ఇంటికి రాకపోయే సరికి ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. శుక్రవారం ఉదయం ధర్మారం గ్రామ సమీప పొలంలో చనిపోయి కనిపించాడు. ఇది హత్య లేదా ఆత్మహత్యన అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-చెన్నూర్

మండలంలోని ఎల్లక్కపేట సివిల్ హాస్పిటల్‌లో శుక్రవారం మెడికల్ క్యాంపును మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్ గిల్డా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైరల్ ఫీవర్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున వైద్యారోగ్య శాఖ నుండి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇవే కాకుండా షుగర్, బ్లడ్ టెస్టులు, అన్ని రకాల డాక్టర్లతో ఆస్పత్రులు ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమమలో ఎంపీపీ మంత్రి బాబు, జెడ్పిటిసి మోత తిరుపతి, వైస్ చైర్మన్ నవజొద్దీన్, కౌన్సిలర్ రెవెల్లి మహేష్, ఎంపీటీసీ శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-భీమారం

రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న కేటీఆర్ భారీ బహిరంగ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలం నుంచి తరలి వెళ్లేందుకు 3500 మందిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు చెరుకు సర్వోత్తం ఒడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ పల్లిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్, మాజీ సర్పంచ్ డేగ రమేష్, గొర్రెల పెంపకం వృత్తిదారుల సొసైటీ చైర్మెన్ కొమ్ము అశోక్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, బలరాంరెడ్డి, ఆత్కూరి రాము పాల్గొన్నారు.

సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి మాజీ ఉద్యోగులు సిపిఆర్ఎంఎస్(ఎన్ఈ) పథకంలో చేరే చివరి అవకాశం కల్పించబడిందని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి పదవీ విరమణ పొందిన, మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ ద్వారా సింగరేణి నుండి వైదొలిగిన ఉద్యోగి, ఉద్యోగి భార్య సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్ పొందడానికి డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎవరైతే ఇంతకుముందు ఈ పథకంలో రూ.40వేలు కంటే తక్కువ కట్టి చేరారో వారికి మిగతా రూ.40వేలు మొత్తం భర్తీ చేసి కొత్త సిపిఆర్ఎంఎస్ పథకంలోకి మారటానికి కూడా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కొరకు ఆయా గనులు, డిపార్టుమెంట్లలో సంక్షేమాధికారులను సంప్రదించాలని తెలిపారు.

నిర్మాణ పనుల నాణ్యత పరిశీలన



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచలాపూర్ గ్రామపంచాయతీలో పనుల నాణ్యతను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఆఫీసర్స్ ఆఫ్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా శుక్రవారం గ్రామాంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యత లోపించకుండా చూడాలని ఆదేశించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన ప్రహరీ, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వనం, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, మల్టి లేయర్ అవెన్యూ ప్లాంటేషన్‌లో మధ్య ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఆయన వెంట అచలాపూర్ పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వాసుదేవ్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

- ఎఫ్ఆర్ఓ హాఫీసొద్దీన్



నవతెలంగాణ-జన్నారం

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎఫ్ఆర్ఓ హాఫీసొద్దీన్ అన్నారు. స్వచ్ఛత పక్వాడలో భాగంగా శుక్రవారం కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ కార్యాలయ సముదాయంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ టైగర్ కన్సర్వేషన్ ఆథారిటీ సూచనల మేరకు వారం రోజుల నుండి కవ్వాల్ పులుల సంరక్షణ పరిధిలోని అటవీ డివిజన్‌లలో పరిసరాలు, ప్రయాణ ప్రాంగణలలో ప్లాస్టిక్ చెత్తను తొలగించడం జరుగుతుందన్నారు. జన్నారం రేంజ్ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణంలో కలిగే నష్టాలు, మార్పులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకూడదని ప్రయాణికులను కోరారు.

పనులు పెండింగ్ లేకుండా చూడాలి

నవతెలంగాణ-మందమర్రి



సివిల్ డిపార్ట్‌మెంట్ పనులు పెండింగ్ లేకుండా చూడాలని మందమర్రి జీఎం మనోహర్ అధికారులకు సూచించారు. శుక్రవారం జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్‌లోని పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ సివిల్ డిపార్ట్‌మెంట్‌లోని అన్ని విభాగాలల్లో పనులు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. పెద్దనపల్లి శివారులోని కేకేఓసీ భూనిర్వాసితుల ఆర్అండ్ఆర్, అవుట్ సోర్సింగ్ పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సివిల్ శ్రీనివాసులు, ఆర్కె పీఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, డీజీఎంఐడీ రాజన్న, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ విజయ ప్రసాద్, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, డీవైపీఎం ఆసిఫ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 30, 2023 | www.navatelangana.com

సిర్పూర్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యత

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలో తలపెట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బోర్కాడె హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతుందన్నారు. మండలంలోని అచ్చెల్లి-చింతకుంట వంతెన, సిర్పూర్-హీరాపూర్ వంతెన, శివపూర్-హీరాపూర్ రోడ్డుకు భూమిపూజ, పాపట్లగూడ వంతెన ప్రారంభించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు, అలాగే మన్నెవార్ సంఘం భవనానికి భూమిపూజ చేసి త్వరలో పనులను చేపడుతామన్నారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీ మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతుందని ఆయన తెలిపారు.

మంచిర్యాల జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని జ్వరాల ప్రభావిత ప్రాంతాలు రాళ్లపేట, గణేష్, హనుమాన్‌నగర్ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, జిల్లా నాయకులు దూర్కే మోహన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. ఇప్పటికే 20 మంది జ్వరాలతో మరణించారన్నారు. మండల కేంద్రాల్లో ఆందోళన పోరాటాలు నిర్వహించడం వల్ల కొన్ని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, వైద్యమందించాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో జ్వరాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ పథకాలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని పులిమడుగు గ్రామంలో మందమర్రి మండల అధ్యక్షుడు బానోతు నీలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ పథకాలు చేర్చే ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ నియోజకవర్గ నాయకులు, పీసీసీ సభ్యులు నూకల రమేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6గ్యారెంటీ కార్డులతో ప్రజలకు, మహిళలకు ఉపయోగపడే పథకాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాంధే రాంచందర్, రామకృష్ణపూర్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి నాయీమ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధం జనార్ధన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరాఠీ శంకర్, బానయ్య, రాజయ్య పాల్గొన్నారు.

పంప్ హౌస్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-జైనథ్

నియోజకవర్గ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన చనక కొరట బ్యారేజ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పనులను పరిశీలించారు. అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్తిఘాట్ వద్ద నిర్మించిన పంప్‌హౌస్ లోపల ఇటీవల వెట్‌రన్ విజయవంతంగా పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. 60 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఎమ్మెల్యే జోగు రామన్న కృషి పట్టుదలతో సహకారం చేసుకోబోతున్నామన్నారు.

నూతన మండలంగా పొన్కల్

నవతెలంగాణ-నిర్మల్

పొన్కల్‌ను నూతనంగా మండలంగా ప్రకటిస్తూ శుక్రవారం ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. పొన్కల్ మండల పరిధిలో పొన్కల్, కమల్‌కోట్, నల్లుర్తి, దేవతాపూర్, వెంకటాపూర్, బండల ఖానాపూర్, పోతారం, అనంతపేట్, కొత్త టింబరేణి (ఆర్‌సి), ఆదర్శనగర్ (ఆర్‌సి), కొత్తూర్, ఎదుదూర్ గ్రామాలు రానున్నాయి.

ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని వరసంత కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మాధవ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజమహ్మద్ గొడుగులను వ్యాపారస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు వర్షాలు కురుస్తుండంతో చిరు వ్యాపారస్తులు ఇబ్బంది పడకుండా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు, శంకర్, సాయన్న, ముత్యం, ఎస్‌కే అహ్మద్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కండక్టర్ ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో ఉన్న రిటైర్డ్ కండక్టర్ ఎం.రాజయ్య కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల కింద వేములవాడకు వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా కూడా పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. 14 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.50 వేల నగుదు అపహరణకు గురైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సురేష్ తెలిపారు.

నీతి అయోగ్ సమావేశానికి అధికారులు, సర్పంచులు

నవతెలంగాణ-నార్నూర్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన దేశ రాజధాని ఢిల్లీలో శనివారం జరగనున్న నీతి ఆయోగ్ సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తతో పాటు ఎంపీడీఓ కావల రమేష్, ఎంపీపీ కనక మోతుబాయి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, నార్నూర్, గంగాపూర్, మాన్యాపూర్, ఎంపల్లి, భీంపూర్ సర్పంచులు బానోత్ గజానంద్ నాయక్, యూర్వేత రూపదేవ్, రాథోడ్ సావిందర్, గోవింద్ రాథోడ్, రాథోడ్ విష్ణు శుక్రవారం బయలుదేరారు. సమావేశంలో పల్లె ప్రగతి, గ్రామాభివృద్ధి గురించి చర్చించనున్నారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆశా వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆర్ఐ ముంతాజ్‌కు వినతిపత్రాన్ని అందించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు పారితోషకాన్ని అందించాలని, పనికి దగ్గ వేతనం రూ.18వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు రాజమణి, సునీత, లక్ష్మీ, సుజాత, పోసాని పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-హాజీపూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా యూనియన్ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల ఎంఈఓ ఆఫీస్ ఎదుట మధ్యాహ్నం భోజనం కార్మికుల సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 8 ప్రకారం పెరిగిన వేతనాలు పెండింగ్ ఏరియర్స్‌తో సహా చెల్లించాలన్నారు. కొత్త మెనూకి బడ్జెట్ పెంచుతూ కోడి గుడ్డును, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ప్రమాదం సౌకర్యం రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల మధ్యాహ్నం భోజనం కార్మికులు పద్మ, రఫియా, కళావతి, రాజేశ్వరి, తిరుపతి పాల్గొన్నారు.

చెన్నూర్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేతి వృత్తుదారుల సంఘం జిల్లా కన్వీనర్ బొడంకి చందు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు చేతి వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ చెన్నూర్ ఏరియా ఉపాధ్యక్షులు జముడి కుమార్, సీఐటీయూ నాయకులు నగేష్, పోసక్క, రాణి, విజయ, సమ్మక్క, సారక్క బూదక్క, పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నభోజన కార్మికులు, కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తానని గతంలో సీఎం హామీ ఇచ్చారని, ఇప్పటివరకు వాటిని పరిష్కరించడంలేదన్నారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మంత్రి స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో కరువును పారదోలేందుకు స్వామినాథన్ హరిత విప్లవానికి నాంది పలికారని, ఎన్నో పరిశోధనలు చేసి రైతు బాంధవుడిగా పేరు ప్రఖ్యాతలు సాధించారని అఖిల పక్షం రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. శుక్రవారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో అఖిలపక్ష రైతుసంఘం ఆధ్వర్యంలో హరిత పితామహుడు, అన్నదాతల ఆత్మబంధువు ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, విశ్లేషకులు హాజరై స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. 1943లో పశ్చిమ బెంగాల్‌లో కరువు నెలకొన్న సమయంలో అనేక పరిశోధనలు చేసి హరిత విప్లవం తీసుకొచ్చారన్నారు. కరువుఛాయలను అంతమొందించాలంటే వరిపంట ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారన్నారు. అనేక ఉద్యమాలలో రైతులు సైతం స్వామినాథన్ కమిషన్ పేరును ప్రస్తావనకు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంద్రత్ సుజాత, దర్శనాల మల్లేష్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, విజ్జగిరి నారాయణ, నగేష్ నాయకులు పాల్గొన్నారు.

అద్భుత అవకాశాలకు నిలయం ఆర్జీయూకేటీ

- వార్షిక వేతనం రూ.15 లక్షలతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు
- వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ

నవతెలంగాణ-బాసర

శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక రంగం అద్భుత అవకాశాలకు బాటలు వేస్తోందని ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ అన్నారు. బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ఈ సంవత్సరం క్యాంపస్ ప్లేస్మెంట్‌లో రూ.15లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. హుగో సేవ్ అనే కంపెనీ జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొన్న మహమ్మద్ అంమ్రత్, కామెరా ప్రణవ్ ఉద్యోగం సాధించడంపై వైస్ ఛాన్స్‌లర్ అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ఎంతో ప్రతిభ గల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ అభినందించారు. మహమ్మద్ అంమ్రత్, నిజామాబాద్ జిల్లా వాసి తండ్రి మటన్ షాపు, తల్లి గృహిణి అని, రామగుండం గోదావరిఖనికి చెందిన కెమెరా ప్రణవ్ తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని తెలిపారు.



కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో కీలకం...

మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, కష్టపడే తత్వం, విశాల దృక్పథంతో వ్యవహరించే గుణం ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయని వీసీ వెంకటరమణ తెలిపారు. జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లలో ఉండే కోర్సులను ఆర్జీయూకేటీ బాసర అందిస్తోందన్నారు. అవకాశాల పరంగా చూస్తే కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు, ఇంటర్వ్యూకు ఎలా సిద్ధం కావాలి తదితర అంశాలతో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీస్ ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. ఉద్యోగాల విషయంలో ఈ రంగంలో డిమాండ్-సప్లై మధ్య భారీగా వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. ఒక శాతం మేర మాత్రమే మానవ వనరులు లభ్యమవుతున్నాయని, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో అభ్యర్థులకు చక్కని అవకాశాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ హరిబాబు, నరేందర్, డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, సృజన విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకు బీఎస్పీ నాయకులు సంఘీభావం

నవతెలంగాణ-మందమర్రి

ఆశాలు చేస్తున్న సమ్మెకు బిఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ముందు ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు బిఎస్పీ మందమర్రి పట్టణ అధ్యక్షులు చిలువేరి రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు తుంగపిండి రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు 18 సంవత్సరాల నుండి నిర్విరామంగా ప్రజలకు సేవలందిస్తున్నా ప్రభుత్వం వారిని గుర్తించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆశాల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి యాకూబ్, పులిపాక శ్రీనివాస్, సంఘీ రాజేందర్, కన్నూరి కృష్ణ పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో మేరి మిట్టి మేరా దేశ్

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని జోడేఘాట్ గ్రామంలో అమరవీరుల త్యాగాలకు గుర్తుగా తపాలశాఖ ఆధ్వర్యంలో మేరా మిట్టి- మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసుల అమరజ్యోతి కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి డోలు వాయిద్యాల మధ్య మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా తపాలశాఖ అధికారి సిరికొండ సతీష్ మాట్లాడుతూ దేశ రాజధానిలో నిర్మించబోయే అమరవీరుల స్థూప నిర్మాణం కోసం మట్టి సేకరణ చేపట్టినట్టు తెలిపారు.

గణేష్ మండపాల వద్ద డబ్బుల దొంగతనం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పోచ్చమ్మగల్లి, రెడ్డిగల్లిలో గురువారం అర్ధరాత్రి మహారాష్ట్రకు చెందిన ఇద్దరు దుండగులు గణేష్ మండపాల వద్ద గణేష్ మెడలో ఉన్న రూ.4100 హారం అపరహణకు గురైంది. మండపాల నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి సమయంలో కొందరు దొండగులు మండపంలోకి చొరబడి దొంగతానికి పాల్పడుతున్నట్టు గమనించారు. అందులో ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.16 వందలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కేసు నమోదు చేసుసుకోని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పాఠశాలల్లో మేరి మిట్టి మేరా దేశ్ కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేత ర్యాలీలు, పంచప్రాణ ప్రతిజ్ఞ చేయడం జరిగిందని సెక్టోరల్ ఆఫీసర్ సుజాత్‌ఖాన్ పేర్కొన్నారు. మాతృభూమికి సేవలందించిన మహనీయులు, వీర జవానులు సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా ఉపన్యాసాలు, నృత్యలు, దేశభక్తి గేయాలతో పాటు కళాకృతులను పెయింటింగ్ వేయడం జరిగిందన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల్లో నిర్వహిస్తున్న హరితహారం లక్ష్యాలు, స్వచ్ఛతాహి సేవా, రూఫ్ వాటర్, హర్వెస్టర్, బయోగ్యాస్ యూనిట్స్, న్యూట్రి విలేజ్, డ్రై డే యాక్టీవిటీస్, జీపీ గ్రంథాలయం, భవనాలు, సోలార్, జీపీ పంచాయితీ అవార్డ్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్, ఫిష్ పాండ్స్, నర్సరీ, ఎవెన్యు ప్లాంటేషన్, తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణలో భాగంగా అన్ని గ్రామాల్లో తడి పొడి చెత్త, సెగ్రిగేషన్ షెడ్ నిర్వహణలో అలసత్వం వహించకూడదని, ప్లాస్టిక్‌ను నియంత్రించే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అందుకొరకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జ్వరంతో గిరిజన యువతి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

జ్వరంతో బాధపడుతు శుక్రవారం గిరిజన యువతి మృతి చెందింది. కుటంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగుట్ట గ్రామానికి చెందిన గంగుబాయి(23) జ్వరంతో శుక్రవారం మృతి చెందారు. ఎర్రగుట్ట గ్రామానికి చెందిన బొజ్జు, అయ్యుబాయి దంపతుల కూతురు గంగుబాయి గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది. జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఈ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-సారంగాపూర్

సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అంగన్‌వాడీలు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టుతూ శుక్రవారం సమ్మెలో భాగంగా 19వ రోజు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కాసిపేట : అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా బోనాలతో నిరసన చేపట్టి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 19 రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా రోజుకో రీతిలో నిరసన తెలుపుతున్నారు. కాగా శుక్రవారం బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆందోళనకు దిగారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్‌ను వేకువ జామునే అరెస్టు చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ రాయితీలతో ప్రారంభమైన సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరినందుకు అరెస్టు చేసి ప్రజల డిమాండ్లను అడ్డుకున్నారన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. ఎస్పీఎంలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఈ విషయంలో స్థానిక యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తోందన్నారు. మంత్రి ఐకే రెడ్డి స్థానికులకు ఉద్యోగావకాశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ముంజం ఆనంద్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా నాయకులు అంబాల ఓదేలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ధీమావ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉస్మానియా మజీద్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ పార్టీ రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే వలస పక్షుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అహ్మద్, జిల్లా నాయకులు అబ్దుల్లా ఫయాజ్, ఖలీద్, గుండా వెంకన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లేష్, సర్పంచ్‌లు బూసి భీమేష్, శ్రీనివాస్, బాబురావు, నాయకులు అమర్ బీన్ అహ్మద్, సాలం పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని అందరికీ పౌష్టికాహారం అందించడమే లక్ష్యమని డీడబ్ల్యూఓ సావిత్రి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కంచుకోట కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మహిళలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సదియ రుక్సానా, సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అరుణ, పుష్పలత పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-హాజీపూర్

నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు సౌకర్యాలు కల్పించేల తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే దివాకర్‌రావ్ అన్నారు. మండలంలోని దొనబండ నుంచి పెద్దంపేట గ్రామాల రహదారి మధ్యలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి ఎమ్మార్ఆర్ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. కాగా శుక్రవారం ఈ పనులకు నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొనబండ, పెద్దంపేట గ్రామాల రహదారి మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల పరిధిలో వేసిన రహదారులను చూసుకొనే బాధ్యత ప్రతి ఒక్క సర్పంచ్‌పై ఉందన్నారు. పడ్తనపల్లి నూతన లిఫ్ట్‌కు టెండరు పక్రియ పూర్తి అయిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. లిఫ్ట్ ద్వారా 10 వేల ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు బతుకమ్మ నిమజ్జనం ఘాట్ ఏర్పాటు చేయాలనీ కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఘాట్ నిర్మాణం కోసం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, సర్పంచ్ అన్నం మధుసుదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బెతు రమాదేవి రవి, ఎంపీటీసీ జాడి వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాధవరపు జీవన్‌రావు, యూత్ అధ్యక్షులు దొమ్మటి బాపు, సర్పంచులు గొల్ల శ్రీనివాస్, కొట్టే మహేందర్, జాడి సత్యం, జడ్పీ కోఆప్షన్ నయీమ్ పాషా, నాయకులు మల్రాజ్ సునీల్ రావు, అల్లముల నాగయ్య, తిరుమల వంశీ పాల్గొన్నారు.